క్లుప్తంగా

నవోదయలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

రాజంపేట : మండలంలోని నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను అర్హులైన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.గంగాధరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లా వాసులై ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి కడప జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, 9వ తరగతిలో ప్రవేశానికి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 23 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 07.02.2026లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలియజేశారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా సిద్దవరం రోడ్డు

పెనగలూరు : మండలంలోఎండలు వేసవిని తలపిస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎండలు తీవ్రతరం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్ నెల వచ్చినా ఎండలు చూస్తే మే నెలలో కాసినట్లు కాస్తున్నాయి. ఉదయం 11 గంటలు దాటిందంటే మెయిన్ రోడ్డు కూడా నిర్మానుష్యంగా మారుతోంది. ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు కూడా రావడం లేదు. ఎండలను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాలు అడపాదడపా కురిసినా ప్రస్తుతం కాచే ఎండలకు బోర్లలో మరలా నీరు తగ్గాయని రైతులు తెలియజేస్తున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



పౌష్టికాహారం అందజేస్తున్న సమితి సభ్యులు

నందలూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముందుగా గర్భిణులకు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ మస్తానమ్మ వైద్య పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు తెలియజేసి, మందులను అందించారు. డాక్టర్ శరత్‌కమల్ మాట్లాడుతూ రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు గంధం గంగాధర, పునగాని రాముయాదవ, కలిశెట్టి భరత్, చంద్ర, లక్ష్మీకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిన్నమండెం : మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నరసింహులకు ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలియజేశారు. రాజ్యాంగ నిర్మాతకు నివాళి అర్పించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఆయనను గౌరవించుకునేందుకు అధికారులు విగ్రహాలు ఏర్పాటు చేసి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దిబ్బల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌కు నివాళి



శాంతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పోలి శంకర్ రెడ్డి తల్లి, వార్డు మెంబర్ పోలి శాంతమ్మ (56) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు శాంతమ్మ మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, సర్పంచ్ ఎస్పీ జయపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్లాట్ సరే.. సదరమేది!

పట్టుతప్పిన ప్రాంతీయ 'వైద్య'శాల

- దివ్యాంగులకు సదరం కష్టాలు
- ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు లేక.. వెనుదిరిగిన దివ్యాంగులు
- అధికారుల తీరుపై ప్రజల మండిపాటు



రాజంపేట ప్రాంతీయ వైద్యశాల

రాజంపేట : పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేటలోని ప్రాంతీయ వైద్యశాలలో ఆదివారం దివ్యాంగులకు సదరం క్యాంపు కష్టాలను చవిచూశారు. ఆర్థో వైద్యుడు లేక దివ్యాంగులు వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో ప్రాంతీయ వైద్యశాలలో సేవలు పట్టుతప్పాయనే విమర్శలను మూటకట్టుకుంది. సదరన్ క్యాంపులో దివ్యాంగులను పరీక్షించి, సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. దీంతో సర్టిఫికెట్లు కావాల్సిన వారు సదరన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు సదరం క్యాంప్‌కు వచ్చారు.

వ్యయ ప్రయసాలతో తరలివచ్చిన దివ్యాంగులు

20 మంది దివ్యాంగులు వ్యయప్రయాసాలకు ఓనర్చి, వాహనాలను అద్దెకు తీసుకొని ప్రాంతీయ వైద్యశాలకు చేరుకున్నారు. తీరా సదరన్ క్యాంప్ నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే వైద్యుడు లేకపోవడంతో దివ్యాంగుల ఆశలు అడియాశలయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు మాధవరెడ్డి పదోన్నతిపై ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మరో వైద్యుడిని నియమించలేదు.

ఆర్థో వైద్యుడు లేదని తెలిసి..

రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో ఆర్థో డాక్టర్ లేదని తెలిసి, సదరం క్యాంప్ నిర్వహణలో స్లాట్‌బుకింగ్ ఏ విధంగా అనుమతి ఇచ్చారని దివ్యాంగులు స్థానికంగా ఉన్న సిబ్బందిని నిలదీశారు. ఓపీ కూడా తీసుకున్నారు. సదరం క్యాంప్ వద్ద గంటల తరబడి వేచివున్నారు. తీరా డాక్టర్ రాదని తెలిసే సరికి దివ్యాంగులలో అసహనం పెరిగిపోయింది. సమాధానం చెప్పేవారులేక, విధిలేని పరిస్థితిలో వ్యయభారంతో వెనుదిరిగారు.

సదరం క్యాంపునకు ప్రత్యేక వైద్యుడిని నియమించాలి

సదరం క్యాంప్‌కు ప్రత్యేక వైద్యుడు అధికారి నియమించాలని సదరం క్యాంప్ బాధిత దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగుల బాధలను జిల్లా కలెక్టరు పట్టించుకోవాలని వారు కోరారు. కాగా రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో ఆర్థో డాక్టర్ నియామకం వరకు సదరం స్లాట్‌బుక్ చేయవద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజు తనపై స్థాయి అధికారులకు విన్నవించినట్లు సమాచారం. ఇది తెలియక దివ్యాంగులు సదరం క్యాంప్ ఉందనే భావనతో తరలివచ్చారు. ఇబ్బందులు పడ్డారు. దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయడం సెకండరీ హెల్త్ డిపార్టుమెంట్‌కు సరికాదని కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఇన్‌చార్జి పూలభాస్కర్ విలేకరుల ఎదుట వాపోయారు.



సదరం సర్టిఫికెట్ కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగుడు

బస్తా కరువు.. వ్యవసాయం బరువు



యూరియా కోసం మాచుపల్లి గ్రామ సచివాలయం వద్ద వేచివున్న రైతులు

- 3వేల బస్తాల యూరియా అవసరముంటే.. వచ్చింది 350 బస్తాలు
- ఎలా సాగు చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న రైతాంగం
- ఇది కేవలం ఒక్క ఆర్‌ఎస్‌కే పరిధిలోనే..

సిద్దవటం : పంటల సాగుకు అవసరమయ్యేంత యూరియా అందుబాటులో లేదని మండల రైతాంగం వాపోతున్నారు. మండలంలోని మాచుపల్లి గ్రామ సచివలయ పరిధి మాచుపల్లి, మూలపల్లి పంచాయతీలకు రైతులకు సూమారు 3వేల బస్తాల యూరియా కావాలి, కానీ ప్రస్తుతం 350 బస్తాల యూరియాను అధికారులు మంజూరు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. మంగళవారం మాచుపల్లి గ్రామ సచివాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మాచుపల్లి సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు మొదటి విడతగా 600 బస్తాల యూరియా రావాల్సి ఉండగా రెండు వందల బస్తాలు మాత్రమే పంపిణీ చేశారన్నారు. రెండో విడతలో ఒక్క బస్తా యూరియా కూడా తమ సచివాలయానికి మంజూరు కాలేదన్నారు. మూడో విడతలో 600 బస్తాలు యూరియా రావాల్సి ఉండగా 150 బస్తాలు మాత్రమే వచ్చాయని వాటిని రైతులకు మంగళవారం పంపిణీ చేశారన్నారు. 10 శాతం యూరియా కూడా అందించకపోవడంపై రైతులు ఆవేదన గురవుతున్నారు. యూరియా లేకుంటే సాగు ఎలా చేయాలో అర్థం కాక కన్నీటి పర్యంతమవుతున్నారు.

మైక్రో ఇరిగేషన్‌తోనే లాభసాటి వ్యవసాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంబేపల్లె : మైక్రో ఇరిగేషన్‌తోనే లాభసాటి వ్యవసాయం చేయవచ్చునని మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి సాయికిరణ్ తెలిపారు. మండల పరిధిలోని మంగళవారం గున్నికుంట్ల గ్రామంలో జిల్లా కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ ప్లాస్టిక్ – ఇరిగేషన్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు సోదరులతో ఆటో క్యాంపెయిన్ నిర్వహించి సూక్ష్మనీటి సాగు పరికరాలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వివరించారు.

ఆలయానికి కుర్చీలు వితరణ



సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న దీప్లానాయక్ మంగళవారం 25 కుర్చీలను ఆలయ అర్చకుడు అమృనాయక్‌కు అందజేశారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి



పెద్దూరు ఎస్టీ కాలనీలో అధికారులు

చిట్వేలి : బడి ఈడు పిల్లలందరూ బడికి వచ్చే విధంగా సీఆర్‌పీలు కృషి చేయాలని సెక్టోరియల్ అధికారి, ఏఎల్‌ఎస్ కో–ఆర్డినేటర్ వెంకట్రామయ్య సీఆర్‌పీలకు సూచించారు. మంగళవారం ఎంఈఓలు కోదండ నాయుడు, ఈశ్వరయ్యలతో కలిసి ఆయన పెద్దూరు ఎస్టీ కాలనీని సందర్శించి అక్కడ బడికి దూరంగా ఉన్నటువంటి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్న తల్లికి వందనం, విద్యా సౌకర్యాలను వివరించారు. తదుపరి చిట్వేలి ఎంఆర్‌సీని సందర్శించి ఏ ఒక్క విద్యార్థి పాఠశాలకు దూరంగా ఉండరాదని సీఆర్‌పీలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, విజయలక్ష్మి, గంగాదేవి, సీఆర్‌పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పినా పట్టించుకోక.. అవస్థలు తాళలేక..!

రోడ్డుకు మరమ్మతులు చేసుకున్న ప్రజలు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న గ్రామస్తుడు

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలోని గంగన్నగారిపల్లె రోడ్డు వర్షాలకు కోతకు గురై గుంతలమయం కాగా వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా గుంతలకు మట్టిని తోలి చదును చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు, కూటమి నాయకులకు పలుమార్లు తెలియజేసిన మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామ ప్రజలే స్వచ్ఛందంగా రోడ్డుకు తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



రాయచోటి టౌన్: దుష్ఫలితాలను తెలియజేస్తున్న స్పెషల్ ఆఫీసర్ నాగభూషణం



చిట్వేలి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధాకర్

చిట్వేలి : మోతాదును మించి యూరియా వాడితే పంటలకు చీడపీడలు ఎక్కువై దిగుబడి తగ్గిపోతుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సుధాకర్ రైతులకు తెలియజేశారు. మంగళవారం మండలంలోని పోల్లోపల్లి, ఎం.గొల్లపల్లి గ్రామాలలో నానో ఎరువులు, జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నేల ఆరోగ్యం బాగుపడాలన్నా, పర్యావరణ పరిరక్షణ ఆరోగ్యం బాగుండాలంటే తప్పనిసరిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించాలని, కేంద్రీయ, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర, జీలుగలు వేయడం వల్ల ఇరవై ఐదు శాతం రసాయన ఎరువులు వాడకం తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి లోకేష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : పంటల సాగుకు యూరియా అధికంగా వాడకం వలన దుష్ఫలితాలు ఎక్కువగా ఉంటాయని రాయచోటి మండల స్పెషల్ ఆఫీసర్ నాగభూషణం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రాయచోటి రూరల్ పరిధిలో మంగళవారం చెన్నముక్కపల్లె, దిగువ అబ్బవరం గ్రామ సచివాలయాల వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం సాగు చేసే సమయంలో రసాయనిక ఎరువులు వాడకం ఎక్కువగా ఉండటం వలన నష్టాలు ఎక్కువగా ఉంటాయన్నారు. యూరియా వాడకం వలన భూసారం తగ్గిపోవడం, భూగర్భ జలాలు, నీటి వనరులు కలుషితం ఎక్కువ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ఎంఏఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపండి

పుల్లంపేట : మండలంలోని కేతరాజుపల్లి, వల్లూరుపల్లి, పుల్లంపేట గ్రామ పంచాయతీలలో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అలానే రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై డెమో రూపంలో ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను అధికంగా వాడటం వలన కలిగే అనర్థాలను వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ జయశ్రీ, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతు చంద్రశేఖర్ నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



యూరియా అనర్థాలను వివరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్

పిల్లలందరిని చదివించాలి

సుండుపల్లె : మండల పరిధిలోని వడ్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమం వారి ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని సంకల్ప ప్రోగ్రామ్ వన్‌స్టాప్ సెంటర్ జిల్లా కౌన్సిలర్ ప్రశాంతికుమారి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలందరిని చదివించాలన్నదే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మహిళలకు సంబంధించి ఆరోగ్యం, వన్‌స్టాప్ సెంటర్ సేవలను వివరించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ గురించి సంకల్ప ప్రోగ్రాం గురించి వివరించారు. కార్యక్రమంలో వడ్లపల్లి అంగన్‌వాడీ టీచర్ పి.కొండమ్మ, ఆశ వర్కర్ సుభాషిణి, ఆయా పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రశాంతికుమారి

పీపీపీ జీఓను రద్దు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య కాలేజీలను ప్రైవేటుపరం (పీపీపీ) చేస్తూ ఇచ్చిన జీఓను వెంటనే రద్దు చేయాలని లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటిలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు వైద్య విద్య, వైద్యసేవలను దూరం చేసే చర్యలను చట్టసభల్లో ఎండగట్టాలని కోరారు. పార్లమెంట్‌లో ఎన్డీఏకి ఎదురొడ్డి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజా కంటక జీఓ రద్దు కోసం ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న మండల సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి

వీరబల్లి : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి సూచించారు. మంగళవారం గుర్రప్పగారిపల్లి పంచాయతీ చిట్‌రాజుగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్రాజుగారి రామచంద్ర, కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఆ గ్రామాన్ని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డితో కలిసి మంగళవారం సందర్శించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో సర్పంచ్‌లను గెలిపించుకోవాలన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పరిపాలనపై ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని, దివ్యాంగుల పింఛన్లు తొలగించి వారి పొట్టకొట్టడం అన్యాయమని అన్నారు. ప్రస్తుత చంద్రబాబు పాలనను చూసి గత వైఎస్ జగన్ పాలనలో ఏమి కోల్పోయామో తెలుసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అనంతరం రామచంద్ర కుటుంబ సభ్యులు ఇచ్చిన విందులో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపినాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు శ్రీరాములు రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బరామరాజు, మదన్‌మోహన్ నాయుడు, యూత్ వింగ్ నాయకులు చక్రి, నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, జై చంద్ర, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టారు'

కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 16న కలెక్టరేట్ వద్ద ధర్నా



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

చిన్నమండెం : కూటమి ప్రభుత్వ విధానాలతో ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయడానికి సెప్టెంబర్ 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలియజేశారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆటో డ్రైవర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ఆటో డ్రైవర్ల పొట్ట కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పథకం వచ్చాక ఆటోలలో ఎక్కేవారే లేక, కుటుంబపోషణ భారంగా మారిందని చెప్పారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు చంద్రబాబు ప్రభుత్వం అందజేయడమే కాక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌సీల కోసం రాయచోటి ఆర్టీఓ కార్యాలయాలకు వచ్చే ఆటో డ్రైవర్లను అధికారులు ఇబ్బందులు గురి చేయడం మానుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను సెప్టెంబర్ 16న జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ చిన్నమండెం నాయకులు రాజేష్, ఆటో డ్రైవర్లు రహంతుల్లా, వెంకటరమణ, బాలు, ఆంజినేయులు, నాగముణి, మున్నా, నసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ బంధాల ఆరంభానికి 'ఫ్రెషర్స్ డే'



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి : స్నేహబంధాల ఆరంభానికి, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఫ్రెషర్స్ డే వేడుకలు తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో మంగళవారం కొత్త విద్యార్థులకు సాదర స్వాగతం పలికే ఫ్రెషర్స్ డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను పేరుపేరున పలుకరిస్తూ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ డైట్ విద్యాలయం ఛాత్రోపాధ్యాయులకు దేవాలయమన్నారు. ఇక్కడే భవిష్యత్తు ఉపాధ్యాయుల స్ఫూర్తి ఆవిష్కృతమవుతుందన్నారు. ఇక్కడి శిక్షణ పొందిన వేలాది మంది ఉపాధ్యాయులుగా రాణిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కొత్త విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా కళాశాల వాతావరణానికి అలవాటు పడేలా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రారంభమైన సేవా పక్షోత్సవాలు



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సేవా పక్షోత్సవాల నిర్వహణలో భాగంగా రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బంగ్లా సర్కిల్ వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ మూడవ సారి ప్రధాన మంత్రి కావడంతో పాటు ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటడం, పాఠశాలలు శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయి లోకేష్, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆనంద గజపతిరాజు, సేవా పక్షోత్సవాల కో–కన్వీనర్ నిమ్మనపల్లి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


పీఎండీఎస్ కిట్‌తో ఉపయోగాలు



వరి పొలాన్ని పరిశీలిస్తున్న డీఆర్ సీపీఓ ప్రభావతమ్మ

లక్కిరెడ్డిపల్లి : వరిలో నానో యూరియా, నానో డీఏపీలకు వేప పండిని కలిపి పిచికారీ చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని డీఆర్ సీపీఓ ప్రభావతమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దిన్నెపాడులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి వరి పంటను పరిశీలించి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీసీఎన్ ద్వారా ఇచ్చే పీఎండీఎస్ కిట్‌లో 15 రకాల ధాన్యాలు ఉంటాయని, వీటిని పచ్చిరొట్ట ఎరువుగాను, పశువుల మేతగాను ఉపయోగించవచ్చన్నారు. వేరుశనగ సాగుచేసే రైతులు రైజోబియం కల్చర్‌ను 8 నుంచి 10 కిలోలు దుక్కిలో చల్లుకోవడం ద్వారా వాతావరణంలోని నత్రజనిని వేరుశనగ మొక్కలకు అందిస్తుందని, ఇది యూరియా వాడకాన్ని తగ్గిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ రాజకుమారి, ఏఈఓ అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ టీచర్లకు శాశ్వత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న వెంకట సత్యనారాయణ

రాయచోటి టౌన్ : క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమితులైన ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్ ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా ఎంపికైన వారి కంటే ముందే శాశ్వత స్థానాలు కల్పించాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ కోరారు. మంగళవారం రాయచోటిలో ఆపస్ (ఏపీయూఎస్) అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరసింహులు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లారు. అలాగే ఇప్పటి వరకు మిగిలిపోయిన భాష పండిట్‌ల పదోన్నతులు భర్తీ చేయాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు పరుశురాం మాట్లాడుతూ పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలన్నారు. రాష్ట్ర సభ్యులు రామాంజనేయులు, భూషణయ్య, నాగరాజు, సుబ్బయ్య, మద్దయ్య, మల్లికార్జున శెట్టి, సీహెచ్ రమణ, నాగేంద్ర ప్రసాద్, వై.నాగేంద్ర బాబు, ఆంజనేయులు, ఓబులేసు, జనార్దన్, నరేంద్ర, శ్రీనివాసులు, వెంకటయ్య, రామ్మోహన్, మధుమతి తదితరులు పాల్గొన్నారు.